
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 17 । జనవరి । 2023



సోమశిలలో 71.540 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 71.540 టీఎంసీలు ఉన్నాయి. 2,073 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 1,170, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,620
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,236
3 శాతం జీఎస్టీతో	రూ.5,393
నవర (8 గ్రా)	రూ.43,144

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.6 /25.9

జిల్లా వ్యాప్తంగా మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలిలో తేమ 60 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేటి పెన్షనర్ల సమావేశం రద్దు

నెల్లూరు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రోటరీ ఆడిటోరియంలో జరగాల్సిన పెన్షనర్ల సర్వసభ్య సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేశామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి వచ్చే నెలలో సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు: సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, మర్రిపాడు మండలాల్లో పదో తరగతిలో ప్రతిభకనబర్చిన పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేయనున్నట్లు సీడ్స్ సంస్థ ప్రతినిధులు వేణుగోపాల్, రసూల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021–22 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 84 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థుల ఉన్నత చదువులకు సీడ్స్ సంస్థ, యువ అన్‌స్టాపబుల్ సహకారంతో ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ నుంచి ఆరేళ్ల పాటు ఒక్కొక్కరికి రూ.2 లక్షల వంతున నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 13 మందికి ఉపకారవేతనాలు అందజేస్తున్నామని చెప్పారు. సీడ్స్ సంస్థ వ్యవస్థాపకుడు రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి సహకారంతో మరికొంతమందికి ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 20లోగా దుత్తలూరులోని సీడ్స్ సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99082 17465, 94417 67186 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డల్లాస్‌లో నెల్లూరీయుల ఆత్మీయ సమ్మేళనం



నెల్లూరు(బారకాసు): సంక్రాంతి సందర్భంగా అమెరికాలోని డల్లాస్‌లో జిల్లాకు చెందిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఉప్పలపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కోర్సిపాటి శ్రీధర్‌రెడ్డి, ఎన్నెమ్మెస్ రెడ్డి, మండువ సురేష్, ఉర్మిడి నరసింహారెడ్డి, యువ చైర్మన్ చిల్లకూరు గోపీరెడ్డి, రమణారెడ్డితో పాటు డల్లాస్‌లోని ప్రముఖులు హాజరయ్యారు. నెల్లూరుతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

ఎస్పీ విజిబుల్ పోలీసింగ్

- రాత్రి నగరంలో కాలినడకన తిరిగి గస్తీ తనిఖీ



రాత్రి సమయంలో నడుచుకుంటూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఎస్పీ విజయారావు స్వయంగా కాలినడకన తిరిగి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి రాత్రి గస్తీని తనిఖీ చేశారు. శనివారం అర్ధరాత్రి సమయంలో నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి వీఆర్సీ సెంటర్, ముత్తుకూరు బస్టాండ్ వరకు, కొత్తూరు ప్రాంతంలోని వైఎస్సార్ నగర్, చంద్రబాబునగర్, గ్రామికనగర్ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను నిర్వహించారు. బీట్ సిబ్బంది, అధికారులతో కలిసి టీ తాగుతూ, బీట్ బుక్స్‌ను తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల ప్రజలతో మాట్లాడి పరిస్థితులను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నిర్మూలనే ధ్యేయంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీని పర్యవేక్షిస్తున్నామన్నారు. రాత్రి సమయాల్లో అక్రమ రవాణా అరికట్టేందుకు వాహనాల తనిఖీలు నిర్వహించాలని, అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు సేకరించాలని సంబంధిత పోలీసులను ఆదేశించామన్నారు. గస్తీ సమయంలో తాళాలు వేసిన ఇళ్ల వద్ద, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఆలయాలు, బ్యాంకులు, ఏటీఎం సెంటర్లు, ముఖ్య కూడళ్ల వద్ద నేర చరిత్ర కలిగిన పాత నేరస్తులు, రౌడీలపై నిఘా పెంచాలని, సమాచారాన్ని ఎస్‌ఆర్‌ఓకు వివరించాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు రక్షణ, భరోసా కల్పించేలా తోడ్పాటు అందించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. పోలీసు వాహనాలకు ఉన్న సైరన్లను మోగిస్తూ రాత్రి గస్తీ చేపట్టాలని బీట్ సిబ్బంది వద్ద విజిల్ కార్డ్, టార్చ్‌లైట్ విధిగా ఉండేలా చూడాలని గస్తీ సమయాల్లో నిర్లక్ష్యం వహిస్తే అందుకు బాధ్యత గల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెల్ట్ విప్పితే ఆన్ డ్యూటీ

- డాగ్ స్క్వాడ్‌తో నేరాల జాడ



ఒబిడియన్స్ శిక్షణ అనంతరం జాగిలాలతో ఆడుతున్న హ్యాండ్లర్స్

- విధి నిర్వహణలో సేవలు అపారం
- పలు కేసుల్లో నిందితులను పట్టించిన జాగిలాలు
- రెండు నెలల వయస్సు నుంచే శిక్షణ
- హ్యాండ్లర్స్ మాటే వేదం
- ఏడాదిలో 42 రోజులే సెలవులు
- జిల్లాలో విధుల్లో 11 డాగ్స్



మిస్టరీగా మారిన ఎన్నో కేసుల్లో నిందితుల ఆచూకీ కనుగొనడంలో పోలీసు జాగిలాల పాత్ర ఎంతో కీలకం. టెక్నాలజీకి కూడా దొరకని నిందితుల జాడను డాగ్ స్క్వాడ్ పట్టిస్తాయి. హత్యలు, పెద్దపెద్ద చోరీలు, అనుమానాస్పద మృతులు, పేలుళ్ల వంటి ఘటనల్లోనే కాకుండా బాంబులను నిర్వీర్యం చేయడంలోనూ, నేర పరిశోధనలో పోలీసులకు డాగ్ స్క్వాడ్ సేవలు చేదోడు, వాదోడుగా నిలుస్తాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పోలీస్ జాగిలాలు.. బెల్ట్ విప్పితే 'ఆన్ డ్యూటీ సార్' అంటూ విధుల్లో అలర్ట్ అవుతాయి. అంతుచిక్కని, భౌతిక ఆధారాలు దొరకని కేసుల్లో నేర పరిశోధనలో, నిందితుల జాడ పట్టించడంలో డాగ్ స్క్వాడ్ సేవలు కీలకంగా మారిన ఉదంతాలు ఉన్నాయి. పోలీసులకు ఎంత గౌరవం ఉంటుందో పోలీస్‌శాఖలో వీటికి అంతకంటే ఎక్కువ గౌరవం ఉంటుంది. రెండు నెలల వయస్సు నుంచే జాగిలాలు పోలీస్ శిక్షణలో భాగస్వామ్యం అవుతాయి. వాటికీ ఉద్యోగిలానే ఉద్యోగ విరమణ ఉంటుంది. విధి నిర్వహణలో వీర మరణం పొందినా, వృద్ధాప్యంతో కాలం చేసినా పోలీస్ లాంఛనాలు, మర్యాదలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

జిల్లాలోనే డాగ్ స్క్వాడ్

గతంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి , కేంద్ర మంత్రుల పర్యటనలు, పెద్దపెద్ద నేరాలు జరిగిన సమయాల్లో హైదరాబాద్ నుంచి డాగ్ స్క్వాడ్ వచ్చేది. వాటికి కేటాయించిన విధులను నిర్వర్తించి తిరిగి వెళ్లిపోయేది. అయితే పెరుగుతున్న నేరాలు, వీవీఐపీ, వీఐపీ పర్యటనలు, పండగలు తదితరాల కారణంగా 2004లో జిల్లాలో డాగ్‌స్క్వాడ్ ఏర్పాటు చేశారు. తొలిసారిగా రెండు డాగ్స్ (ఎక్స్‌ప్లోజివ్ డిటెక్టర్)ను జిల్లాకు పంపారు. ఆ తర్వాత 2006లో పింకీ, 2007లో డైమండ్, 2012లో లక్కీ, సింధు, 2014లో బిందు ఇలా ఇప్పటి వరకు పలు డాగ్స్ వచ్చాయి.



జాగిలాలకు ఎయిర్‌కూలర్‌తో కూడిన గది

డాగ్స్ దిన చర్య

జిల్లాలో 14 డాగ్స్ ఉండగా అందులో 3 రిటైర్ అయ్యాయి. 11 డాగ్స్ విధి నిర్వహణలో ఉన్నాయి. అందులో 8 ఎక్స్‌ప్లోజింగ్ డాగ్స్, 3 ట్రాకర్ డాగ్స్‌గా విధులు నిర్వహిస్తున్నాయి.

వీటి పోషణ, శిక్షణ కోసం పదకొండు మంది హ్యాండ్లర్స్ ఉన్నారు. వీరు ఉదయం 5.30 గంటలకు డాగ్స్‌ను నిద్రలేపుతారు. ఆరు నుంచి 7.30 గంటల వరకు పోలీస్ కవాతు మైదానంలో శిక్షణ ఇస్తారు. అనంతరం పోలీస్ పాత జిల్లా కార్యాలయంలో వెనుక భాగంలో డాగ్ కెలాల్స్‌కు చేరుతాయి. అరగంట విశ్రాంతి తీసుకుంటాయి. అనంతరం 250 గ్రాముల రాయల్ కెనైన్ ఫీడ్‌ను అందిస్తారు. అనంతరం 12.30 గంటలకు డాగ్స్‌ను బయటకు వదిలి కాలకృత్యాలు పూర్తి చేయించి నీరు తాగిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మళ్లీ 250 గ్రాముల ఫీడ్‌ను అందిస్తారు. డాగ్స్ నిద్రపోయేందుకు కెలాల్స్‌లో కూలర్, ఫ్యాన్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కోడాగ్‌కు ఒక్కో గది ఏర్పాటు చేశారు. నేరపరిశోధనలో జిల్లా డాగ్ స్క్వాడ్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవార్డులు అందాయి. డ్యానీకి 2018లో ఆల్ ఇండియా గోల్డ్‌మెడల్, ఏంజల్‌కు 2019లో ఆల్‌ఇండియా కాంస్య పతకం దక్కింది.

8 నెలల పాటు శిక్షణ

పోలీస్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ద్వారా రెండు నెలల వయసు ఉన్న జాగిలాలను హైదరాబాద్‌లోనే సేకరిస్తారు. డాగ్ కొనుగోలు సమయంలోనే వాటి పుట్టు పూర్వోత్తరాలను పరిశీలిస్తారు. వాటి జీన్స్ అన్నీ అనుకూలిస్తేనే డాగ్‌ను కొనుగోలు చేసి జిల్లాలకు కేటాయిస్తారు. ఆయా జిల్లాల్లోని హ్యాండలర్స్‌ను డాగ్ శిక్షణ కోసం పిలిపిస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని మెయినాబాద్‌లో విభజన అనంతరం మంగళగిరిలో శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడే హ్యాండలర్స్‌కు డాగ్‌ను పరిచయం చేస్తారు. 8 నెలలు పాటు శిక్షణలో మొదటి రెండు నెలలు హ్యాండలర్స్‌తో లవ్ అండ్ ఎఫెక్షన్, మరో రెండు నెలలు ఒబిడియంట్, మిగిలిన నాలుగు నెలల్లో డాగ్‌ను ఏ రంగానికి ఎంపిక చేస్తారో ఆ రంగంలో శిక్షణ ఇస్తారు. నార్కోటిక్ ఎక్స్‌ప్లోజివ్, ట్రాకర్ ఇలా ఎంపిక చేసిన రంగాల్లో శిక్షణనిచ్చి అనంతరం కేటాయించిన జిల్లాకు వాటిని పంపుతారు. పోలీసులు యూనిఫాం వేసుకుంటే డ్యూటీలో ఉన్నట్లుగా డాగ్స్‌కు హార్నీస్ (బెల్టు) వేస్తే అవి డ్యూటీలో ఉన్నట్లే. బెల్టు మెడలో నుంచి బయటకు తీసేంత వరకు విధి నిర్వహణలో ఉంటాయి. హ్యాండలర్స్ సైగలు ఆదేశాలతో నేరస్తులను గుర్తించడం, బాంబ్ మైన్స్ తదితరాలను గుర్తిస్తాయి.

- 2021లో ఓజిలి, ఆత్మకూరు ప్రాంతంలో దొంగతనాలు జరిగాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోపలికి చొరబడి చోరీ చేశారు. దాదాపు రూ.10 లక్షల విలువ చేసే నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆ కేసును ఛేదించడంతో ట్రాకర్ డాగ్ కీలకంగా మారింది. ఆ చోరీ కేసులో నిందితుల జాడను ట్రాకర్ డాగ్ పట్టించింది.
- కైరో ట్రాకర్ డాగ్.. గతంలో ఉదయగిరి నియోజకవర్గంలో నాటు బాంబుల గుర్తించి అందరి మన్ననలు పొందింది. ఇలా నేర పరిశోధనలో క్రియాశీలకంగా డాగ్‌లు వ్యవహరిస్తున్నాయి. గొంతులో ప్రాణం ఉన్నంత వరకు శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు కృషి చేస్తున్నాయి.

ఎక్స్‌ప్లోజివ్ డాగ్	హ్యాండలర్స్
డ్యానీ	బి.వెంకటయ్య
క్యాండీ	ఏ రాజేష్
ఎంజిల్	ఎం.రాజశేఖర్
గోల్డీ	ఎ. సుబ్రహ్మణ్యం
జాకీ	సీహెచ్ గోవిందయ్య
స్వీటీ	హేమంత్‌కుమార్
కైరో	ఎస్.తిరుపతి
ఆస్కార్	ఎస్.రమేష్
ట్రాకర్ డాగ్స్	
బిందు	డీ సురేష్
రాక్సీ	సీహెచ్ రమేష్‌బాబు
షాడో	ఎం.రవి

వాసన పసిగట్టి పట్టేస్తాయి

చిన్న వయస్సు నుంచే అన్ని విధాలా శిక్షణ ఇస్తాం. నేరపరిశోధనలో దొరికే క్లూ ఆధారంగా వాసన పసిగడతాయి. వాసనను బట్టి నిందితులను పట్టిస్తాయి. హ్యాండలర్ ఇచ్చే మూవ్‌మెంట్‌ను బట్టి వాటి విధులు ఉంటాయి. జిల్లాలో ఎన్నో నేర పరిశోధనలో ఈ డాగ్స్ ఉపయోగపడ్డాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయి పతకాలు కూడా సాధించాయి.

– గోవర్ధన్, ఏఆర్ ఎస్‌ఐ నెల్లూరు

శిక్షణ కఠినంగా ఉంటుంది

డాగ్‌కు ప్రేమ, ఆప్యాయతల నుంచే శిక్షణ ఉంటుంది. రెండు నెలల వయస్సు నుంచే ఎనిమిది నెలల పాటు అన్ని విధాలా శిక్షణ ఇస్తాం. శిక్షణ చాలా కఠినంగా ఉంటుంది. నేరపరిశోధనపై వాటికి అవగాహన కలిస్తాం. ఏదైనా క్లూ దొరికిన వెంటనే వాటి ఆధారంగా నిందితులను పసిగట్టడంలో డాగ్‌లు క్రియాశీలకంగా ఉపయోగపడతాయి.

– సురేష్, హెడ్‌కానిస్టేబుల్



హ్యాండ్లర్ సురేష్‌కు నమస్కరిస్తున్న జాగిలం బిందు





పోలీసు జాగిలాలకు ఫీడింగ్ ఇస్తున్న హ్యాండ్లర్స్





నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో హ్యాండ్లర్స్‌తో కలిసి పరేడ్ చేస్తున్న పోలీసు జాగిలాలు

లాహిరి లాహిరి లాహిరిలో..

- వైభవంగా కనుమ తెప్పోత్సవం
- కనుల పండువగా భ్రమరాంబ మల్లేశ్వరుల జలవిహారం
- తరలివచ్చిన దేవతలు
- వీక్షించి తరించిన భక్తజనం కిటకిటలాడిన మైపాడు మార్గం



జాఫర్‌సాహెబ్ కాలువలో తెప్పపై విహరిస్తున్న భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి

నెల్లూరు (బృందావనం): సంక్రాంతి పండగను పురస్కరించుకుని నగరంలోని మైపాడుగేట్ సెంటర్‌లోని జాఫర్‌సాహెబ్ కాలువలో సోమవారం రాత్రి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. నవాబుపేటలోని దేవస్థానం నుంచి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి సర్వాలంకార శోభితంగా పల్లకిలో కొలువై మంగళ వాయిద్యాలు, సింగారి మేళతాళాలు, బాణసంచా వెలుగులు, విద్యుత్ దీపకాంతులు భక్తుల నామస్మరణ నడుమ మైపాడుగేట్ సెంటర్‌కు అశేష భక్త జనసందోహంతో తరలివచ్చారు. తొలుత సంప్రదాయంగా తెప్పోత్సవం జరిగే జాఫర్‌సాహెబ్ కాలువ ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో కొలువుదీరి దర్శనమిస్తూ భక్తకోటిని అనుగ్రహించారు. అనంతరం విశేషాలంకారంలో స్వామివార్లు జాఫర్‌సాహెబ్ కాలువలో సుందరంగా, విద్యుద్దీపాలంకరణలతో తీర్చిదిద్దిన తెప్పపైకి వేంచేపు చేశారు. శాస్త్రోక్త పూజలనంతరం ఐదు పర్యాయాలు తెప్పపై స్వామివార్లు జలవిహారం చేశారు. వైభవంగా జరిగిన తెప్పోత్సవంలో భక్తులకు స్వామివార్లు కనుల పండువగా దర్శనమిస్తూ కటాక్షించారు. సంప్రదాయంగా కనుమ పార్వేట ఉత్సవం వేడుకగా నిర్వహించారు.

తరలివచ్చిన దేవతలు.. తిలకించి తరించిన భక్తజనం

సంప్రదాయంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని శ్రీసిద్ధివిఘ్నేశ్వరాలయం నుంచి మైపాడుగేట్ కిసాన్‌నగర్ పత్తివారి సత్రం వరకు శ్రీసిద్ధివిఘ్నేశ్వరస్వామి,, శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి, భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి, మహాలక్ష్మి, రాజరాజేశ్వరి అమ్మవారు తదితర దేవతామూర్తులు తరలివచ్చి కొలువుదీరారు. ఆయా దేవస్థానాల ఆధ్వర్యంలో స్వామివార్లకు తాత్కాలిక ప్రతిష్టలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, భక్త బృందాలు భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

కిటకిటలాడిన మైపాడుగేట్ సెంటర్

అంగరంగ వైభవంగా జరిగే భ్రమరాంబ సమేత మల్లేశ్వరుల స్వామి వారి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన వేలాది మంది భక్తజనంతో మైపాడుగేట్ ప్రాంతం సోమవారం రాత్రి కిటకిటలాడింది. వివిధ దేవతామూర్తుల విద్యుద్దీపాలంకరణలో మైపాడుగేట్ ప్రాంతం శోభిల్లింది.

తెప్పోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

నేత్ర పర్వంగా జరిగిన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి తెప్పోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరునగర ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ వంగాల శ్రీనివాసులురెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమాలు దేవస్థానం ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు



దేవదేవేరుల సేవలో జెడ్పీ చైర్పర్సన్, ఎమ్మెల్యే తదితరులు



తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న అశేష భక్తజనం

పితృదేవతలకు ప్రణమిల్లి..

- సంప్రదాయంగా సంక్రాంతి, కనుమ



నెల్లూరు (బృందావనం): మధుర జ్ఞాపకాలు.. చెమ్మగిల్లిన కళ్లతో పితృదేవతలకు సంక్రాంతి (పెద్ద పండగ) రోజున ప్రణమిల్లి పూజలు చేశారు. నగరంలోని పవిత్ర పినాకినీ తీరాన బోడిగాడితోట (సమాధుల తోట)లో ఉన్న తమ పితృదేవతల, పెద్దల, పూర్వీకులు కనుమరుగైన చివరి మజిలీ చెంత మోకరిల్లారు. వారితో తమకు ఉన్న ఆత్మీయ అనుబంధాలను, ప్రేమానురాగాలను, పెద్దల సూచనలను, వారి వ్యవహార శైలిని తమ వారితో పంచుకుని భావోద్వేగాలలకు లోనయ్యారు. వారికి ప్రీతికరమైన పిండి వంటలు సమర్పించి, ధూపదీపాలతో పూజలు చేశారు.



బోడిగాడి తోటలో పెద్దలు, పూర్వీకుల సమాధుల వద్ద పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు

ఆనందోత్సాహాలతో పండగలు

తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతిని మూడు రోజులు సింహపురీయులు ఆనందోత్సాహాలతో సంప్రదాయంగా జరుపుకున్నారు. దేశ విదేశాల్లో స్థిరపడిన బంధుమిత్రులు మూడు రోజులు వేడుక సంక్రాంతి పండగను ఆత్మీయానుబంధాల నడుమ జరుపుకునేందుకు తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులు, సన్నిహితులు, ఆప్తుల నడుమ నగరంలో, పట్టణంలో, పల్లెల్లో ఉన్న లోగిళ్లు వేడుకలతో సందడిగా మారాయి. తొలిరోజు శనివారం భోగి, ఆదివారం మకర సంక్రాంతి పండగను తమ పితృదేవతలను స్మరిస్తూ, ఇష్టదైవాలను వేడుకుంటూ పూజలు నిర్వహించారు. సోమవారం పశు సంపదను, ప్రకృతిని కరుణించమని వేడుకుంటూ కనుమ పండుగను జరుపుకున్నారు. ఆలయాల్లో గోపూజను, స్వామివారి పార్వేట ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు.

కోలాహలంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

- బ్రాహ్మణక్రాకలో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ
- వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న 8 జతల ఎడ్లు
- విజేతగా నిలిచిన వైఎస్సార్ జిల్లా ఎడ్లు

జలదంకి: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని బ్రాహ్మణక్రాకలోని శివాలయం వద్ద ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. బ్రాహ్మణక్రాక ఎడ్ల సంఘం ఆధ్వర్యంలో ఏటా సంక్రాంతి రోజున సంప్రదాయబద్ధంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కనివిని ఎరుగని రీతిలో నిర్వహించిన ఈ పోటీల్లో వైఎస్సార్ జిల్లా ఖాదరాబాద్‌కు చెందిన నాగ సుబ్బారెడ్డి ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో 3,300 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా కల్లూరుకు చెందిన పెరుమల్ల శివకృష్ణ యాదవ్ ఎడ్లు 3,093 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా హనుమగుత్తికి చెందిన సంగటి శృతిప్రియ ఎడ్లు 2,771 అడుగుల దూరం బండనులాగి తృతీయ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా పోతిరెడ్డి పల్లెకు చెందిన మాలె బయ్యపరెడ్డి ఎడ్లు 2,709 అడుగుల దూరం బండనులాగి నాల్గో స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా గండుచేపాడుకు చెందిన గురు మల్లికార్జున ఎడ్లు 2,701 అడుగుల దూరం బండను లాగి ఐదో స్థానంలో నిలిచాయి. కాగా ఎడ్ల బండలాగుడు పోటీలను తిలకించేందుకు బ్రాహ్మణక్రాక పరిసర ప్రాంతాల గ్రామాలకు చెందిన వారు పెద్దఎత్తున తరలిరావడంతో కోలాహల వాతావరణం నెలకొంది.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఎడ్ల బండలాగుడు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన నాగ సుబ్బారెడ్డి ఎడ్లకు జలుమూడి బ్రదర్స్ రూ.45 వేలు, జ్ఞాపిక అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన పెరుమల్ల శివకృష్ణయాదవ్ ఎడ్లకు ఇందూరి శంకరలింగం జ్ఞాపకార్థంగా ఇందూరి బ్రదర్స్ రూ.35వేలు అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన సంగటి శృతిప్రియ ఎడ్లకు వేలమూరి రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా వారి మనుమలు రూ.25 వేలు అందజేశారు. నాల్గో స్థానంలో నిలిచిన మాలె బయ్యపరెడ్డి ఎడ్లకు పున్నం రోశిరెడ్డి రూ.15 వేలు, ఐదో స్థానంలో నిలిచిన గురు మల్లికార్జున ఎడ్లకు దేవరపల్లి కొండారెడ్డి రూ.10 వేలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ఎడ్లకు ప్రోత్సాహకంగా రూ.5వేలు నగదును నిర్వాహకులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన వారికి అన్నదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కలిగిరి సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



బండను లాగుతున్న ఎడ్లు



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని నాగసుబ్బారెడ్డికి నగదు బహుమతి ప్రదానం

సత్తాచాటిన మైదుకూరు ఎడ్లు

సోమశిల: కనుమ పండగ సందర్భంగా అనంతసాగరం మండలం పడమటికంభంపాడులోని ధర్మపల్లెమ్మ గుడి వద్ద సోమవారం ఎడ్ల బండలాగుడు పోటీలను కోలాహలంగా నిర్వహించారు. సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆరు జతల ఎడ్లు పాల్గొనగా, వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన కే వెంకటేష్ యాదవ్ ఎడ్లు రెండు టన్నుల బండను 3,010 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.40,116 నగదును దక్కించుకున్నాయి. వల్లూరు మండలం లింగాయపల్లికి చెందిన పుల్లాల సురేష్ ఎడ్లు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.30,116 నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే సూరారెడ్డి ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచి రూ.20,116 నగదు బహుమతి అందుకున్నాయి. అదే గ్రామానికి చెందిన శాగంరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎడ్లు నాల్గో స్థానంలో నిలిచి రూ.10,116, ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డి ఎడ్లు ఐదో స్థానంలో నిలిచి రూ.5,116 నగదు బహుమతులను కైవసం చేసుకున్నాయి. దేవపూడి సదాశివరెడ్డి తన వ్యాఖ్యానంతో అలరించారు. గ్రామానికి చెందిన బియ్యం రమేష్‌యాదవ్, ఎంబలూరి రమణయ్య పోటీల నిర్వాహకులుగా వ్యవహరించారు. నాయకులు అంబటి కృష్ణారెడ్డి, ఎద్దుల శ్రీనివాసులరెడ్డి, వల్లూరు కృష్ణారెడ్డి, మాలకొండపనాయుడు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



సోమశిల: ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత ప్రభాకర్‌రెడ్డి

గంజాయి ముఠా గుట్టురట్టు

- గంజాయిని చెన్నైకు తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్
- వీరిలో ఇద్దరు మహిళలు
- రూ.12.40లక్షల విలువైన 10 కేజీల గంజాయి, కారు స్వాధీనం



విలేకరులకు నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సెబ్ జేడీ శ్రీలక్ష్మి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిను కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా సంపాదిస్తున్న ముఠా గుట్టును నెల్లూరు సెబ్ సిబ్బంది రట్టు చేశారు. ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10 కేజీల గంజాయి, కేజీ లిక్విడ్ గంజాయితో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెబ్ జేడీ శ్రీలక్ష్మి వెల్లడించారు. హౌరా నుంచి చెన్నై సెంట్రల్ మెయిల్ రైలులో నలుగురు వ్యక్తులు గంజాయిను తరలిస్తున్నట్లు శనివారం రాత్రి నెల్లూరు సెబ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎస్పీ విజయారావు, ఆదేశాల మేరకు సెబ్ జేడీ పర్యవేక్షణలో సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ బృందం ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, సెబ్ స్టేషన్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ కిషోర్ వారి సిబ్బందితో ఆదివారం అర్ధరాత్రి12.10 గంటలకు నెల్లూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుని నిఘా ఉంచారు. ఈ క్రమంలో రైలు దిగిన ఓ వ్యక్తి పోలీసులను చూసి మళ్లీ రైలు ఎక్కాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన సెబ్ సిబ్బంది సదరు వ్యక్తిని గమనించి రైలెక్కి పట్టుకుని విచారించగా, తనతో పాటు మరో ముగ్గురు రైలులో ఉన్నారని చెప్పాడు. దీంతో గూడూరు రైల్వేపోలీసులకు సమాచారం అందించి గూడూరు రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపి నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.68 లక్షల విలువైన 9 కేజీల గంజాయి, రూ.1.40 లక్షల విలువైన ఒక కేజీ లిక్విడ్ గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు ఇచ్చిన సమాచారంతో తడ ప్రాంతంలో చెన్నైకు చెందిన రాజేష్ అనే వ్యక్తికి చెందిన కారులో రూ.22 వేల విలువైన కిలో గంజాయిను పట్టుకున్నారు. గంజాయితో పాటు రూ.9లక్షల విలువైన కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రాజేష్‌తో పాటు రైలులో పట్టుకున్న అనంతపురం జిల్లాకు చెందిన నేతాజీ, అల్లూరు సీతారామరాజు జిల్లాకు చెందిన నాగేశ్వరరావు, విశాఖపట్నానికి చెందిన కుమారితో పాటు ఓ చిన్నారిని అరెస్ట్ చేసినట్లు జేడీ తెలిపారు.

విలాసాలకు అలవాటుపడి..


అనంతపురం జిల్లాకు చెందిన నేతాజీ బీబీఎం చదివాడు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి అక్రమ మార్గంలో డబ్బు సంపాదనకు గంజాయి స్మగ్లింగ్‌ను ఎంచుకున్నాడు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిను కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. నేతాజీపై 2021లో వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో అక్రమ గంజాయి రవాణా కేసు ఉంది. తడ వద్ద పట్టుబడిన చెన్నైకు చెందిన రాజేష్ మెకానికల్ ఇంజినీరింగ్ చదివాడు. ఓప్రైవేట్ కంపెనీ నడుపుతూ గంజాయికు బానిసయ్యాడు. స్నేహితులకు కూడా గంజాయిని సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. మిగిలిన ముగ్గురు డబ్బుకు ఆశపడి గంజాయి రవాణా చేస్తున్నారు. కాగా గంజాయి స్మగ్లింగ్ ముఠాను పట్టుకున్న జేడీ పోలీస్ బృందం ఎస్సై బాలకృష్ణ, కానిస్టేబుళ్లు విజయ్‌కుమార్, వాసు, జగదీష్, అజీజ్‌బాషా, నెల్లూరు సెబ్-1 స్టేషన్ ఎస్సై శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుళ్లు రషీద్, కానిస్టేబుల్స్ రాజయ్య, శ్రీరాములను ఎస్పీ విజయారావు ప్రత్యేకంగా అభినందించారని సెబ్ జేడీ శ్రీలక్ష్మి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కందుకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిఆంధ్ర కాలనీలో సోమవారం వెలుగుచూసింది. మృతుడి బంధువుల వివరాల మేరకు... ఆదిఆంధ్ర కాలనీకి చెందిన చదలవాడ ఇజ్రాయేల్(37)కు పొన్నలూరు మండలం చెరువుకూరుకు చెందిన యువతితో వివాహమైంది. వీరి కి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అద్దె ఇంట్లో ఉంటూ, కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్థాపానికి గురై న ఇజ్రాయేల్ సోమవారం ఇంట్లో ఉరేసుకుని కనిపించాడు. స్థానికుల సమా చారంతో ఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు ఇజ్రాయేల్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో చంపి ఉరివేసి ఉంటారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ. 37
సన్నవి	: రూ. 20
పండ్లు	: రూ. 7



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.116
లేయర్	రూ.100
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.226
లేయర్ చికెన్:	రూ.170



రాష్ట్రానికి శాశ్వత సీఎంగా వైఎస్ జగన్ ఉండాలి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత సీఎంగా ఉండాలని సంక్రాంతి సందర్భంగా తాను భగవంతుడ్ని కోరుకున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కాకాణి తన స్వగ్రామం తోడేరులో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. తొలుత తన తండ్రి పొదలకూరు సమితి మాజీ అధ్యక్షుడు, సీనియర్ రాజకీయ నాయకుడు కాకాణి రమణారెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పేదల అభివృద్ధికి పడుతున్న తపన చూసి ఆయనే శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామని వెల్లడించారు. తన స్వగ్రామం తోడేరుపై వల్లమాలిన మమకారం ఉందన్నారు. ఇక్కడి నుంచే తన తండ్రి, తాను రాజకీయ అరంగేట్రం చేసి పదవులు పొందామన్నారు. గ్రామస్తులు తమ కుటుంబంపై చూపుతున్న అభిమానంతోనే రాజకీయాల్లో రాణిస్తున్నామన్నారు. అందుకే ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడుతున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో కరువు కాటకాలు లేకుండా సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో గడపాలని సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. అనంతరం మంత్రిని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట వైస్ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ మండలాల పార్టీ నాయకులు ఉన్నారు.



కాకాణి రమణారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సంక్రాంతికి పుంజుకున్న నిమ్మధరలు

- బస్తా కాయలు రూ.3 వేలు

పొదలకూరు: సంక్రాంతి సందర్భంగా నిమ్మ ధరలు రైతులు కోలుకునేలా పుంజుకున్నాయి. పండగ రోజులకు ముందు వరకు దిగజారిన ధరలతో రైతులు ఢీలాపడిపోయారు. తోటల్లో కాయలు విపరీతంగా ఉన్నా కాయలను కోయాలంటే గిట్టుబాటు కాని ధరలతో నష్టం వస్తుందని మిన్నకుండిపోయారు. సంక్రాంతికి రెండ్రోజుల ముందు నుంచి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా చలితీవ్రత అధికంగా ఉన్నా కాయలు ధరలు పెరగడంపై నిమ్మరైతులు ఆశ్చర్యపోయారు. నిన్నటి వరకు బస్తా కాయలు గరిష్ట ధర రూ.800 కూడా పలకలేదు. ప్రస్తుతం ధరలు పెరిగినట్టు వ్యాపారులు వెల్లడించారు. స్థానిక నిమ్మమార్కెట్ యార్డులో నిమ్మకాయలు కిలో రూ.20 నుంచి రూ.37 వరకు పలుకుతున్నాయి. లూజు(బస్తా) లెక్కన పరిశీలిస్తే రూ.2,200 నుంచి రూ.3 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. నాణ్యత కలిగిన నిమ్మకాయలకు మాత్రమే మంచిధరలు లభిస్తున్నాయి. అయితే మంచుప్రభావంతో కాయల నాణ్యత లోపించడంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. గతేడాది సకాలంలో వర్షాలు కురవడంతో భూమిలో తేమశాతం పెరిగి నిమ్మ కాయల దిగుబడి బాగా ఉండడంతో నిత్యం మార్కెట్‌కు వందల సంఖ్యలో బస్తాలు వచ్చేవి. ప్రస్తుతం కాయల దిగుబడి తగ్గినట్టు రైతులు వెల్లడించారు.

తెనాలి, ఏలూరు మార్కెట్లకు సెలవులు కావడంతో..

తెనాలి, ఏలూరు నిమ్మ మార్కెట్లకు సంక్రాంతి సందర్భంగా వరుసగా సెలవులు ప్రకటించారు. ఫలితంగా అక్కడి నుంచి కాయల ఎగుమతి లేదు. పొదలకూరు, గూడూరు మార్కెట్ల నుంచి పండగ సీజన్‌లోనూ కాయలు ఎగుమతి జరగడంతో ఇక్కడి కాయలకు డిమాండ్ పెరిగి ధరలు లభిస్తున్నాయి. చిన్నపాటి మార్కెట్లలో కూడా పండగ సీజన్‌లో కాయలు కొనుగోలు చేయకపోవడంతో ఢిల్లీ మార్కెట్లో పొదలకూరుకు కాయలకు గిట్టుబాటు ధరలు లభించాయి. ఈ ధరలు మరో రెండు, మూడురోజులు మాత్రమే ఉంటాయని వ్యాపారులు వెల్లడించారు.



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

కోడిపందేల స్థావరాలపై దాడులు

జిల్లా వ్యాప్తంగా కోడిపందేల స్థావరాలపై పోలీసులు ఆది,సోమవారాల్లో దాడులు నిర్వహించారు. 24 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.16,080 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆత్మకూరు: బోయలచిరివెళ, వెంకట్రావుపల్లిలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై సీఐ కే నాగేశ్వరరావు, ఎస్సై శివశంకర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఆరుగురు జూదరులను పట్టుకున్నారు. 4 కోడిపుంజులు, రూ.6250 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కావలి రూరల్: మద్దూరుపాడు అటవీ ప్రాంతంలోని కోడిపందేల స్థావరంపై రూరల్ ఎస్సై ఎం వెంకటరావు, జీ వీరేంద్రబాబు తమ సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారు. నలుగురు జూదరులను పట్టుకున్నారు. ఒక కోడి, రూ. 2,310 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఉదయగిరి: వెంకట్రావుపల్లి, జీ చెరువుపల్లి శివారు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై ఎస్సై జీ అంకమ్మ తన సిబ్బందితో ఆది, సోమవారాల్లో దాడులు నిర్వహించారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. 4 కోళ్లు, రూ.1550 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కలిగిరి: తూర్పుదూబగుంట సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి ఆదివారం దాడులు చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రెండు కోడిపుంజులు, రెండు మోటార్ సైకిళ్లు, రూ. 4420 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వరికుంటపాడు: తూర్పుబోయమడుగుల సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై బాలమహేంద్రనాయక్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. నాలుగు కోళ్లు, రూ.1,550 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి

వరికుంటపాడు: వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన విరువూరు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..ఉదయగిరి మండలం గడిపాళేనికి చెందిన జడ దీపక్ కారులో ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్తున్నాడు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన ఆర్ల ఏసోబు, మరియదాసు మోటార్‌సైకిల్‌పై పామూరు వెళ్లి తిరిగి వస్తున్నారు. విరువూరు సమీపంలో మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఏసోబు(55) అక్కడికక్కడే మృతి చెందాడు. మరియదాసు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో ఎస్సై బాలమహేంద్రనాయక్ తన సిబ్బందితో క్షతగాత్రుడు మరియదాసును పామూరులోని వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఏసోబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీపక్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఏసోబు మృతదేహం

చెడుగుడు పోటీల విజేతలు ముదివర్తి, పాపిరెడ్డిపాళెం





పురుషుల విభాగం విజేత ముదివర్తి ఫ్రెండ్స్, మహిళా విభాగం విజేత పాపిరెడ్డిపాళెం జట్లకు షీల్డుల ప్రదానం

తోటపల్లిగూడూరు: సంక్రాంతి సందర్భంగా మండలంలోని పాపిరెడ్డిపాళెంలో ఆల్తూరి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా రెండ్రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేతలు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆల్తూరి మహేష్‌రెడ్డి సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన ఈ పోటీల్లో పురుషుల విభాగంలో ముదివర్తికి చెందిన చంటి ఫ్రెండ్స్, మహిళా విభాగంలో పాపిరెడ్డిపాళెం జట్లు విజేతలుగా నిలిచాయి. ఆదివారం రాత్రి టోర్నమెంట్ లీగ్ దశ పోటీలు రసవత్తరంగా సాగాయి. పురుషుల విభాగంలో ముదివర్తి చంటి ఫ్రెండ్స్, రావూరు, ముదివర్తి, క్రైస్తవపాళెం, కేకే పాళెం, ఇందుకూరుపేట జట్లు వరుసగా మొదటి ఆరుస్థానాల్లో నిలిచాయి. ఈ జట్లకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. మహిళల విభాగంలో పాపిరెడ్డిపాళెం, సబ్బు నాగేశ్వరావు(సంగం), ఏసీ స్టేడియం, చెలికలి, సంగం జట్లు వరుసగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఈ జట్లకు రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. వరిగొండ శ్యాంసుందరరెడ్డి, నిర్వాహకులు తిరవళ్లూరు ఈశ్వరయ్య, కదురు వెంకటసుబ్బయ్య, దద్దోలు వెంకటకృష్ణయ్య, తిరవళ్లూరు వెంకటేశ్వర్లు, జనార్దన్, ధర్మయ్య, రాము, మోహన్, మురళీ, హరి, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.